

డీజీపీని కలిసిన ఎస్పీ, బెటాలియన్ కమాండెంట్



విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌తో పాటు ఆయన భార్య ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్ శనివారం రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వేతన జీవులకు ఊరట

- కిసాన్ క్రెడిట్ కార్డుతో వ్యవసాయానికి ఆసరా
- ఊపందుకోనున్న రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం
- జూట్ పరిశ్రమలు తెరుచుకునే అవకాశం
- బడ్జెట్‌కు ముందు గురజాడ గేయాన్ని గుర్తుచేసిన ఆర్థిక మంత్రి

కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు ఊరట కల్పించింది. విద్య, వ్యవసాయం దగ్గర నుంచి టెక్నాలజీ రంగం వరకూ ప్రోత్సాహకాలను ప్రకటించింది. మధ్య తరగతితో పాటు వేతన జీవులకు సైతం పన్ను మినహాయింపు ద్వారా గుడ్‌న్యూస్ చెప్పింది. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తోలు ఉత్పత్తులకు మద్దతు ధర పెంచడం ద్వారా జూట్ పరిశ్రమలకు కొత్త రోజులు రానున్నాయి. చేనేతకు కూడా ఆసరా దక్కనుంది. అంతర్ రాష్ట్ర రహదారులు, వంతెనల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించారు. దీనివల్ల జిల్లాకు మిగతా ప్రాంతాలతో కనెక్టివిటీ పెరగనుంది. పారిశ్రామిక, పర్యాటక రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా జిల్లాలో కొత్త అభివృద్ధి వైపు అడుగులు పడే అవకాశం ఉంది.



విజయనగరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై అధికశాతం వర్గాలు సంతృప్తితో ఉన్నారు. కొందరు పెదవి విరుస్తున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, యువకులను ప్రోత్సహించేలా బడ్జెట్‌ను రూపొందించారు. కీలకమైన రోగాలకు వాడే 36 రకాల మందులను పన్ను నుంచి మినహాయించారు. వ్యవసాయానికి సంబంధించి కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న విజయనగరం రైతులకు మేలు కలగనుంది. దేశీయంగా తయారయ్యే దుస్తుల విషయంలో కూడా మినహాయింపులు ఇచ్చారు. ఇది జిల్లాలో చేనేత రంగానికి కొంత ఊతం ఇచ్చినట్టయింది. తోలు ఉత్పత్తులకు (మిగతా 10వ పేజీలో...)

బడ్జెట్‌లో దేశప్రయోజనాలకు పెద్దపీట..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో దేశప్రయోజనాలకు పెద్దపీట వేశారని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రజామోద బడ్జెట్‌గా అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి సముచిత రీతిలో ప్రాధాన్యం దక్కిందని అన్నారు. సీఎం చంద్ర బాబు ఏడు నెలలుగా రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న కృషి తాలుకా ప్రభావం బడ్జెట్‌పై స్పష్టంగా ఉందన్నారు. జల్‌జీవన్ మిషన్ గడువు పొడిగింపు అందుకు నిదర్శనమని ఎంపీ అప్పలనాయుడు పేర్కొన్నారు.

-టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

దేశ ప్రజలందరికీ మేలు..



కేంద్ర బడ్జెట్ దేశానికి, రాష్ట్రానికి మేలు చేసేదిగా ఉంది. ఎంఎస్ఎంఈల కోసం రూ.10 వేల కోట్లతో ఫండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షణీయం. ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచడం చాలా ఉపయోగం. అన్ని ప్రాంతాల సమతుల్య అభివృద్ధిని, సమ్మిళిత వృద్ధిని కాంక్షించి బడ్జెట్ రూపొందించారు.

-మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బడ్జెట్ బాగుంది..

బడ్జెట్ బాగుంది. అన్ని వర్గాలకు మేలు చేసేదిగా వుంది. వేతన జీవులకు మరింత ఊరటనిచ్చింది. నెలకు లక్ష రూపాయలు, ఏడాదికి 12 లక్షల వరకూ పన్ను పరిధిలోకి రాకుండా తీసుకున్న నిర్ణయం స్వాగతించదగ్గది. వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత లభించింది. ముఖ్యంగా చిన్న పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించారు.

- ఈఆర్ సోమయాజులు, సీనియర్ ఆడిటర్



వేపాడ సమీపంలో అడుగంటిన బావి

వేసవిలో తాగునీరెలా?

- నదుల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- ఇంకా మారని గత ప్రభుత్వ పోకడలు
- ఊటబావుల వద్ద వ్యర్థాలు
- అంతంతమాత్రంగా నీటి ప్రవాహం
- మూలకు చేరిన బోర్లు
- ఏటా తగ్గుతున్న భూగర్భ జలాలు

నదుల్లో నీరు లేకపోవడం.. ఊటబావుల చెంత ఇసుక తవ్వకాలు జరపడం.. బోర్లు మూలకు చేరడం తదితర ఘటనలు చూస్తున్న వారంతా వేసవిలో ఎలా అని సందేహపడుతున్నారు. ఇప్పటికే చలి తగ్గుతూ ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటల తర్వాత భానుడి సెగలు మొదలైపోయాయి. వాతావరణంలో వస్తున్న ఈ మార్పులతో వేసవి సమీపిస్తోందన్న అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారు. రానున్న రోజుల్లో మండే ఎండల నుంచి కాస్త తెరిపిన పడాలంటే తాగునీరు కీలకం. ఏటా పట్టణాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. విజయనగరంలో రెండు లేదా మూడు రోజులకు ఒకసారి సరఫరా చేసిన ఘటనలు ఉన్నాయి.

విజయనగరం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):

ఈ ఏడాది ఎండలు మండే పరిస్థితి కనిపిస్తోంది. సంక్రాంతి తరువాత ఒక్కసారిగా వాతావరణం మారింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. భూగర్భ జలాలు తగ్గితే తాగునీటికి ఇక్కట్లే. నదుల్లో ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో నీటివనరులు తగ్గే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి మండలంలోని వేగావతి, నెల్లిమర్ల, గజపతినగరం మండలాల్లోని చంపావతి నదిలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. తాగునీటి అవసరాలకోసం ఏర్పాటు చేసిన ఊటబావుల వద్ద సైతం లోతుగా తోడేస్తున్నారు. వాటి చెంత వ్యర్థాలు పేరుకుపోయినా పట్టించుకోవడం లేదు. దీనివల్ల తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే మున్ముందు చుక్కలు చూపించే అవకాశం ఉంది. ఈ ఏడాది ఎండలు మండుతాయని.. ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఐదేళ్లలో అస్తవ్యస్తం

ఐదేళ్ల వైసీపీ పాలనలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దానిని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. విజయనగరం నగరపాలక సంస్థ, బొబ్బిలి, రాజాం మునిసిపాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు మేజర్ పంచాయతీల్లోనూ తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గుర్లలో డయేరియా ప్రబలడానికి తాగునీరే కారణమన్న ఆరోపణలు వచ్చాయి. నాగావళి, చంపావతి, వేగావతి, సువర్ణముఖి నదుల్లో (మిగతా 10వ పేజీలో..)

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

జిల్లాలో తాగునీటి వనరుల నిర్వహణపై దృష్టిపెట్టాం. ముందుగానే క్రాష్ ప్రోగ్రం ప్రారంభించాం. అందుకు సంబంధించి సామగ్రిని మండలాల వారీగా అందజేశాం. స్థానిక సంస్థలు నిర్వహణ చూసుకోవాలి. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సహకారం అందించాలి. వేసవిలో దాహం కేకలు లేకుండా చూడాలన్నదే లక్ష్యం.

- కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, విజయనగరం



బొబ్బిలి మండలం అలజంగి వద్ద వేగావతి నదిలో కుంగిన ఊటబావి


ఆ గంట.. ఎందుకంట?

- నిర్ణీత సమయం కన్నా ముందే మద్యం దుకాణాల మూత
- బార్లకు లబ్ధి చేకూర్చేందుకేనా?
- సిండికేటైనట్లు సర్వత్రా అనుమానం

రాజాం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాజాంలో మద్యం షాపులు మూడు రోజులుగా నిర్ణీత సమయం కన్నా ముందే మూతపడుతున్నాయి. గంట ముందు షట్టర్ దించేస్తున్నారు. సాధారణంగా పది నిమిషాలు ఆలస్యంగా మూత పడే దుకాణాలు ఇప్పుడెందుకలా అని మద్యం ప్రియులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బార్లుకు మేలు చేసేందుకే ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందరూ కలిసిపోయి మందుబాబులను దోచుకునే ప్రణాళిక అమలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

మద్యం విక్రయాలు, బెల్ట్‌షాపులకు బాటిళ్ల సరఫరా, ధరల పెంపు, షాపుల వద్ద తాగేందుకు ఏర్పాట్లు చేయడం తదతర అంశాలపై కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వ్యవహరిస్తుంటే.. రాజాంలో మద్యం షాపుల యజమానులు మాత్రం అంతా మా ఇష్టం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాలను కాదని సొంతంగా నిర్ణయాలు తీసుకుని ఓ గంట ముందే షాపుల్ని బంద్ చేస్తున్నారు. బార్లతో పాటు మద్యం దుకాణాలూ ఇటీవల సిండికేటైన నేపథ్యంలో గంట ముందు షాపుల్ని మూసివేస్తున్నారు. ఇలా చేస్తే మద్యం ప్రియులు బార్లవైపు పరుగులు పెడతారని, బార్లలో ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్ముతుండంతో అందరికీ నాలుగు రాళ్లు కలిసొస్తాయన్న ఆలోచనతో మద్యం దుకాణాల యజమానులు ఈ నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. గడచిన మూడు రోజులుగా రాత్రి 9 గంటలకే మద్యం దుకాణాలకు షట్టర్లు మూత పడుతుండడంతో మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ తెరిచి ఉంచాలి.

మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువకు అమ్మేందుకు వీలుకాదు. కానీ సమయం, సందర్భాన్ని బట్టి బార్లలో ఎమ్మార్పీ కన్నా అదనంగా వసూలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కాగా రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూయాల్సి ఉండగా ఓ గంట ముందు షాపులకు తాళాలు వేస్తే మద్యం ప్రియులు గత్యంతరం లేక బార్లను ఆశ్రయించే అవకాశాలు లేకపోలేదు. ఆ గంటలో బార్లకు అదనంగా ఆదాయం రానుంది. దీంతో సిండికేట్‌గా ఏర్పడిన వీరంతా ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చి గడచిన మూడురోజులుగా షాపుల్ని బంద్ చేస్తున్నారు. మద్యం ప్రియులు విలవిల్లాడుతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో అదనపు ధర చెల్లించుకుంటున్నారు.



శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మూతపడిన మద్యం షాపులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

బాబ్జీరావు, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్‌శాఖ

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఉదయం పది నుంచి రాత్రి పదిగంటల వరకూ మద్యం షాపులు ఖచ్చితంగా తెరిచి ఉంచాలి. రాజాంలో రాత్రి తొమ్మిది గంటలకే మద్యం షాపులు మూసివేయడంపై దర్యాప్తు చేస్తాం. ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. రాత్రి పదిగంటల వరకూ షాపులు తెరిచి ఉంచేలా మరోసారి ఆదేశాలు జారీచేస్తాం.

ఉడా కాలనీలో విద్యుత్ దీపాలు

- బోరుకు మరమ్మతులు
- దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామన్న కమిషనర్
- 'అక్షరం అండగా- పరిష్కారమే అజెండాగా'లో వినతులకు స్పందన

8

సౌకర్యాలు లేవు.. సిబ్బంది లేరు

- ఇదీ కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద పరిస్థితి

8

డీఎఫ్‌వోగా కొండలరావు



డీఎఫ్‌వో కొండలరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అటవీశాఖ సిబ్బంది

విజయనగరం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖాధికారిగా ఆర్.కొండలరావు శనివారం డీఎఫ్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని, నగర వనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోడ్ అమలుకు నోడల్ అధికారులు



విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి... కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసీసీ అమలుకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ నియమితులయ్యారు. మండలాల్లో ఎంపీడీవోలు మోడల్ కోడ్ అమలు చేస్తారు. మున్సిపాల్టీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందంలో ఒక వీడియో గ్రాఫర్ కూడా ఉంటారు. విజయనగరంలో కమిషనర్ పి.నల్లనయ్య, బొబ్బిలిలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రాజాంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు, నెల్లిమర్లలో కమిషనర్ కె.అప్పలరాజు, వీడియో గ్రాఫర్లు నియమితులయ్యారు. ప్రతి మండలంలో తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (పోలీసు అధికారి), ఇద్దరు పోలీసు కానిస్టేబుల్, వీడియో గ్రాఫర్ కలిసి పర్యవేక్షిస్తారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం మార్చి 8వ తేదీ వరకూ నిర్వహించరని డీఆర్‌వో శ్రీనివాస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కొండడాబా వ్యాకులమాత జాతర

8





కనీస సౌకర్యాలు లేని కొట్టక్కి చెక్‌పోస్టు

సౌకర్యాలు లేవు.. సిబ్బంది లేరు

● ఇదీ కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద పరిస్థితి

రామభద్రపురం,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయి రవాణా నిరోధించడానికి కొట్టక్కి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో పోలీసు సిబ్బంది అగచాట్లకు గురవుతున్నారు.ప్రధానంగాఇక్కడ పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిం చలేదు. ఇటీవల భారీఎత్తున వాహనాల్లో గంజాయిఅక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ఈచెక్‌పోస్టు అధికారులు ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.24 గంటలూ విధుల్లో ఉంటున్న సిబ్బందికి కనీసం టెంటు కూడా ఏర్పాటుచేయలేదు. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కూడా లేవు. ఈజాతీయరహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. హెచ్‌సీ, కానిస్టేబుల్‌ను మాత్రమే నియమించారు.వీరిద్దరే కావడంతో తనిఖీలుచేయడానికి ఇబ్బందిపడుతున్నారు. ఈ మార్గంలో పెద్దఎత్తున రవాణా అవుతున్న గంజాయిని ఇద్దరు ఎలా నిరోధించగలరని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒడిశా సరిహద్దుకు 40 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో ఇటీవల సుమారు వెయ్యి కిలోలపైబడి గంజాయిని రామభద్రపురం పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. లైటింగ్ సదుపాయం లేకపోవడంతో రాత్రి విధి నిర్వహణలో ఉంటున్న సిబ్బంది చిమ్మ చీకట్లో విధులు నిర్వహించాల్సివస్తోంది. ఎక్కువగా చీకటిపడితన తర్వాతే గంజాయి వంటి నిషేధ పదార్థాలు ఈ మార్గంలో తరలిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇక్కడ చెక్‌పోస్టులో సిబ్బందికి వసతులు కల్పించాల్సిఉంది.

రాగోలులో చేతివాటం

● చనిపోయిన వ్యక్తుల పేరుతో ఉన్న రేషన్ కార్డుల బియ్యం స్వాహా

గుర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగోలులో మృతిచెందిన అంత్యోదయ కార్డుల లబ్ధిదారుల బియ్యం స్వాహా జరుగుతోంది. ఈ విషయంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొందరు అంత్యోదయ కార్డు లబ్ధిదారులు మూడున్నరేళ్ల కిందట మృతి చెందినా ఆయాకార్డులు సరెండర్‌కాలేదు. నేటికీ బియ్యం కొందరికి చేరుతున్నాయి. వలంటీర్ వ్యవస్థ ఉన్న సమయంలో వారి చేతి వేలిముద్రలు ఒకరిపేరు మీద వేసి బియ్యం విడుదల చేసేవారని సమాచారం. తర్వాత వీఆర్వో లాగిన్ నుంచి అందజేసేవారు. ఈ నేపథ్యంలో కలవచర్ల, పాలవలస, నాగులవలస, రాగోలు, చిననాగలవలస గ్రామాల్లో 14 మంది అంత్యోదయ కార్డు లబ్ధిదారులు మృతిచెందినా బియ్యం కొందరికి అందుతున్నాయని విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో చనిపోయిన అంత్యోదయ కార్డు లబ్ధిదారుల వారిపేరిట బియ్యం ఇప్పటికీ విడుదల అవుతున్నాయని రాగోలుకు చెందిన కొందరు అమరావతిలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు తెలుస్తోంది. కాగా పూర్తిగా సమాచారం అమరావతిలో ఉందని, వీటిపై సమాచారం రావడానికి నాలుగు రోజులుపడుతుందని హెచ్‌డీటీ నివాసరావు తెలిపారు. కాగా బియ్యం స్వాహా విషయం ఇంతవరకు తనకు తెలియదని తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు.

నేడు పరదేశమ్మతల్లి తీర్థమహోత్సవం

వేపాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేపాడ శివారులోని బక్కునాయుడుపేటలో ఆదివారం పరదేశమ్మతల్లి తీర్థమహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఒకప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి దూప దీప నైవేద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని, భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు, రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు పీడీఎస్ బియ్యం వేలం

గజపతినగరం, ఫిబ్రవరి1:(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తు పట్టుబడిన పీడీఎస్ బియ్యం వేలంపాట గజపతినగరం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.రత్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలంలో 6ఎ కేసులు నమోదు చేసి సీజ్ చేసిన 55.339 మెట్రిక్ టన్నుల బియ్యం జేసీ ఆదేశాల మేరకు వేలం పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు అక్షరాభ్యాసాలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరపంచాయితీ పరిధిలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మాఘ పంచమి పురస్కరించుకుని సోమవారం సామూహిక అక్షరాభ్యాసకార్యక్రమం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

పోలీస్ గ్రీవెన్స్ రద్దు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) రద్దుచేస్తున్నట్లు ఎస్పీ వకూల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతగ్రీవెన్సెను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించండి

రాజాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పట్టణంలో రహదారులపై ఉన్న రాజకీయ నా యకుల ఫ్లెక్సీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్‌కమిషనర్ జె.రామప్పల నాయుడు సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.విగ్రహాలకు ముసుగులు వేయాలని కోరారు. అలాగే ఆగూరు, డీఆర్‌వలస, గెడ్డముడిదాంల్లో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పర్యటించిన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు ముసుగులు తొలగించవద్దని ఆదేశించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు శనివారం పీహెచ్‌సీ వైద్యులు బి.అనీల్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం వ్యాధులు, ఆరోగ్య భద్రత, శానిటేషన్‌పైఅవగాహన కల్పించారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

జామి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజినిగిరిలో శనివారం ఆయూష్ వైద్యులు అయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60మందికి పరీక్షించి ఉచితంగా మందులు అందించారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు.. బోరుకు మరమ్మతులు

● దశల వారీగా ఉడా కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం: కమిషనర్

● 'అక్షరం అండగా- పరిష్కారమే అజెండాగా'లో అందిన వినతులకు స్పందన


బోరుబావి నుంచి నీరు సరఫరా అవుతున్న దృశ్యం

విజయనగరం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):గాంధీ పార్క్‌లో పాడైన విద్యుత్ దీపాలను తొలగించి, కొత్త దీపాలు ఏర్పాటుచేస్తున్నారు. పాడైన బోరుబావికి మరమ్మతులు చేపట్టి, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. విజయనగరం నగరపాలక సంస్థలోని 43వ డివిజన్ ఉడాకాలనీలోగత నెల 28న నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలోఅక్షరం అండగా- పరిష్కారమే అజెండాగా సదస్సు నిర్వహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా కాలనీవాసులు పలుసమస్యలు వివరించారు. ఈనేపథ్యంలో కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య సమస్యలపై స్పందించారు. ఇందులో భాగంగా కమిషనర్ ఆదేశాల మేరకు మూడురోజులుగా కాలనీలో పారిశుధ్య నిర్వహణ, కాలువల్లో పూడికలు తొలగింపుపనులు చేపడుతున్నారు.దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.సదస్సులో గుర్తించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని నగరపాలక కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.

నేడు కొండడాబా వ్యాకులమాత జాతర


జాతరకు నడుచుకుంటూ వస్తున్న భక్తులు

కొత్తవలస, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస కొండడాబాలోని వ్యాకుల మాత జాతరను ఆదివారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. సుమారు 140 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ వ్యాకుల మాత జాతరను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో వచ్చే మొదటి ఆదివారం నిర్వహిస్తుంటారు. వ్యాకుల మాత దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతుంటారు. వ్యాకులమాత విగ్రహాన్ని 1885లో ఫ్రాన్స్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠిం చినట్టు నిర్వాహకులు తెలిపారు. జాతర జరిగే ఆదివారానికి ముందురోజు శనివారం విశాఖనుంచి మరియమ్మను పల్లకిలో ఉంచి.. కాలినడకన ఇక్కడికి తీసుకువస్తారు. ఈ జాతరకు క్రైస్తవులతో పాటు వివిధ మతాలకు చెందిన వారు వస్తుంటారు. కాగా వ్యాకుల మాత జాతరకు వచ్చే భక్తుల కోసం విశాఖ, విజయనగరం, ఎస్.కోట, సింహాచలం డిపోల నుంచి బస్సు సర్వీసులను నడుపుతున్నారు. ఈ సందర్భంగా ప టిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కొండడాబా యాత్ర సందర్భంగా రద్దీని నివారించేందుకు శనివారం సాయంత్రం నుంచి ట్రాఫిక్‌ను మళ్లించా మని సీఐ షణ్ముఖరావు తెలిపారు. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి కొన్ని వాహనాలను పంపిస్తున్నామని చెప్పారు. తుమ్మికాపల్లి, సీతంపేట మీదుగా మరికొన్ని వాహనాలను మళ్లిస్తున్నట్టు తెలిపారు. విశాఖ నుంచి పాదయాత్రగా వచ్చే భక్తులకు చింతలపాలెం, మంగళంపాలెం, దేశపాత్రునిపాలెం జంక్షన్ల వద్ద స్వచ్ఛంద సంస్థలు అల్పాహారంతో పాటు మందులను అందిస్తున్నాయి.

రోడ్డు పనులు నిర్వహించండి

● ఆతవ గ్రామస్థుల రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న ఆతవ గ్రామస్థులు

వేపాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):తక్షణమే తారు రోడ్డు పనులు నిర్వహించాలని ఆతవ గ్రామస్థులు కోరారు. ఈమేరకు ఆతవలో ఏడోరోజు శనివారం రాస్తారోకో నిర్వహించారు.ఆతవ రోడ్డును అభివృద్ధి చేయాలని వారం రోజులుగా రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళనచేస్తున్న విషయం విదితమే.ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు చల్లా జగన్, గ్రామస్థులు ఆతవ ఉదయభాస్కర్, కెర్రిదే ముడు, ఆతవ నాగరాజు,సర్పంచ్ గంప వేమనరాము, గొంప సన్నిబాబు మాట్లాడుతూ తారు రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.కోటీ 28 లక్షలు మంజూరుచేయగా, మధ్యలో పనులు నిలిపివేయడంతో రాళ్లుతేలిన రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిపడుతు న్నారని తెలిపారు.పనులుచేపట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మునిసిపాలిటీకి వాహనాల వితరణ

రాజాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సాలిడ్ వేస్ట్‌ను సమర్థంగా నిర్వహించడానికి జీఎంఆర్ గ్రూప్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు రెండు వాహనాలను కొనుగోలు చేసి అందజేశారు. ఇక్కడ వాహనాలు లేకపోవడంతో కమిషనర్ జీఎంఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. 15 ఏళ్ల కాలం నాటి వాహనాలు ఉండడంతో పట్టణ శివారులోని కొత్తవలస, గోపాలపురం, బుచ్చింపేట, పొనుగుటివలస, సారధిలో ప్రతిరోజూ సాలిడ్ వేస్ట్ సేకరణకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనేపథ్యంలో ఇటీవల జీఎంఆర్‌కు కమిషనర్ సమస్యను వివరించారు. తక్షణమే రెండు ట్రాక్టర్లు కేటాయించారు. సాలిడ్ వేస్ట్‌ను ప్రతి ఇంటి నుంచి సేకరించి విశాఖపట్నంలోని జిందాల్ సాలిడ్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించనున్నట్లు కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. వాహనాల అందజేసే కార్యక్రమంలో జీఎంఆర్ పీఏ ఆర్.అన్నంనాయుడు, టీపీవో తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవం

● కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన రవికుమార్


మాట్లాడుతున్న మిడతాన రవికుమార్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన రవికుమార్ తెలిపారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో తలసరి ఆదాయం తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.800 కోట్లు కూటమి ప్రభుత్వ విడుదల చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా నడవనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు: ఎంపీడీవో

రాజాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం శ్యాంపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద మస్తర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మస్తర్లు వేయడంలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

●వేపాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో ఉపాధి పనులను ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.


రాజాం: మస్తర్లను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఉరుసు ఉత్సవాలకు లోకేశ్‌కు ఆహ్వానం


ఉరుసు ఆహ్వాన పత్రికను లోకేశ్‌కు అందజేస్తున్న దర్గా ధర్మకర్త ఖలీల్ బాబు

విజయనగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలో హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 66వ ఉరుసు, గంధ మహోత్సవాలకు మంత్రి నారా లోకేశ్‌ను ఖాదర్‌బాబా దర్గా దర్బార్ ముతావల్లి డాక్టర్ ఎండీ ఖలీల్‌బాబు ఆహ్వానించారు.ఈమేరకు తాడేపల్లిలోని మంత్రి కార్యాలయంలో శనివారం ఆహ్వాన పత్రికను అందజేశారు.దర్గా దర్బార్ పుణ్యక్షేత్రంలో ఈనెల 8,9, 10 తేదీల్లో ఈ ఉత్సవాలు జరగనున్నాయని, ఉరుసు మహోత్సవాలు, సూఫీ విశిష్టతను మంత్రికి వివరించారు. సుమారు పది దేశాలతోపాటు, దేశ నలుమూలల నుంచి ఖాదర్ బాబా భక్తులు ఉత్సవాలకు హాజరవుతారని తెలిపారు. కులమతాలకతీతంగా విజయనగరంలో ప్రతిష్ఠాత్మాకంగా ఖాదర్‌బాబా ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ

రాజాం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కోరారు. శనివారం రాజాంలోని డిగ్రీ కళాశాల, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, సైబర్ క్రైంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సంకల్ప్ రథం ద్వారా వీడియో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ. వై.రవికిరణ్ పాల్గొన్నారు. అలాగే రేగిడి మండలంలోని తాటిపాడులో రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరరావు మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

సమాన అవకాశాలు కల్పించాలి

విజయనగరం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలకు పూర్తి హక్కులు, సమాన అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని ఏపీఎన్‌జీజీవోఎస్ రాష్ట్ర కన్వీనర్ రాజ్యలక్ష్మి, చైర్‌పర్సన్ నిర్మలకుమారి కోరారు. విజయనగరంలోని సంఘ కార్యాలయంలో ఏపీఎన్‌జీజీవోఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతిర్మయి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా హక్కుల పరిరక్షణ, మహిళా సంఘాల ప్రాధాన్యత చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ మాధవి, జాయింట్ కన్వీనర్ సురేఖ, ఎర్రయ్యమ్మ, భువన, శాంతి, పావని, వెంకట పద్మజ పాల్గొన్నారు.

95.87 శాతం పింఛన్లు పంపిణీ

విజయనగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 95.87 శాతం మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 2,74 , 541 పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నామని, ఇందుకోసం సుమారు 116 కోట్ల రూపాయలకు పైగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 2,63,202 మందికి పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు.

వాలీబాల్ క్రీడాకారిణికి అభినందన

గుర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో జమ్ముపేటకు చెందిన వాలీబాల్ క్రీడాకారిణి వరలక్ష్మికి గ్రామస్థులు సన్మానించారు. వరలక్ష్మి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో శనివారం గ్రామ పెద్దలు, సర్పంచ్ గ్రామస్థులు అభినందించారు.

ఫీజు పోరు హాస్యాస్పదం

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన సకాలంలో చెల్లించకుండా విద్యార్థులను నట్టేట ముంచిన వైఎస్‌జగన్ తాజాగా ఫీజుపోరు పేరిట నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్ ఎద్దేవాచేశారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న సమయంలో గుర్తుకు రాని రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా హఠాత్తుగా ఎలా గుర్తుకువచ్చాయని ప్రశ్నించారు. వందల కోట్లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు రోడ్డెక్కి నిరసనలు చేపట్టినా అప్పట్లో పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఫీజుపోరు కార్యక్రమాన్ని నిర్వహించే ముందు జగన్, వైసీపీ నాయకులు ఆలోచించాలన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన్ తదితర వాటికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు కోరాడ రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెవర భరత్

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

విజయనగరం క్రైం,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి):విద్యుదాఘాతంతో ఓ తాపీ మేస్త్రి మృతిచెందాడు. విజయనగరంరూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ కథనం మేరకు.. ముడిదాంలోని ఓ భవనంలో మొరకముడిదాం మండలంలోని ఇప్పిలవలస గ్రామానికి చెందిన కన్నూరి ఆదినారాయణ (40) పనిచేస్తున్నాడు. పరంజామీద ఉన్న ఇనుప చువ్వను తొలగించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మొదట అంతస్థు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదినారాయణకు పాప,బాబు ఉన్నారు. భార్య గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

చికిత్సపొందుతూ యువకుడు..

గుర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీహార్ చెందిన ఓ యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు,స్థానికుల కథనం మేరకు.. కోటగండ్రేడులోని రైసుమిల్లులో బీహార్‌చెందిన కుమార్‌రెండునెలలుగా పనిచేస్తున్నాడు. అదేప్రాంతంలో రూములో ఉంటున్నాడు. శుక్రవారం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో గొడవపడ్డాడు.అనంతరం రైసుమిల్లు వద్ద పనికి వచ్చాడు. అక్కడ పని ముగించుకొని అనంతరం ఇంటికి చేరారు. తర్వాత శుక్రవారం అర్ధరాత్రి బీహార్ తమ కుటుంబవ్యక్తులతో ఫోన్‌లో గొడవకుదిగాడు. ఆ సమయంలో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు పట్టుకొవడంతో స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించగా కుమారు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మ పేటలో పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ పి.నరేంద్ర కుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన కొంకి సత్యం మద్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ జనార్దనరావు ఆదేశాల మేరకు దాడిచేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసునమెదు చేసినట్ల తెలిపారు.

● విజయనగరం క్రైం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మక్కువ మండలంలోని ఎ.వెంకంపేటలో బొంతుశివకుమార్‌ను అదుపులోకి తీసుకొని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ శనివారం తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు నిమిత్తం సాలూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో హెచ్‌సీ రాంబాబు, ఈసీలు రాము, జనార్ధనరావు, మనోజ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు.

చినరాజులగుమ్మడలో చెరకు తోటలు దగ్ధం

వంగర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరాజులగుమ్మడలో శనివారం ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి శ్రీను, డి.ప్రభాకరరావుతోపాటు పలువురికి చెందిన ఆరెకరాల్లో చెరకు తోటలు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న పాలకొండ అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.పది లక్షలు వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు. కాగా గ్రామంలో కొందరు చెరకు పంటను కొట్టిన తర్వాన పొలంలో గడ్డి కాల్చారు. ఆ సమయంలో పెట్టిన మంటలు పక్కన ఉ న్న పొలాలకు వ్యాపించి ఉండొచ్చని పలువరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

రూ.150 అప్పు చెల్లించాలని అడగడంతో దాడి

భోగాపురం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన రూ.150 తిరిగి అడగడంతో అప్పు తీసుకొన్న వ్యక్తి దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రామచంద్రపేటకు చెందిన కోలా సూరి, కొంగవానిపాలెంకు చెందిన ముద్దాడరమణ ముక్కాం సమీప హేచరీలో పనిచేస్తున్నారు. కోలాసూరి వద్ద ముద్దాడరమణ రూ.150 అప్పుతీసుకున్నాడు. తీసుకొన్న డబ్బులు తిరిగి ఇవ్వాలని సూరి రమణను అడిగాడు. మద్యం మత్తులో ఉన్న రమణ బీరు సీసాతో సూరిని గాయపరిచాడు. దీంతో రమణను స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అనంతరం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితుడు కోలాసూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

సరుకులు ఇవ్వలేదని..

శృంగవరపుకోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట వన్‌వే ట్రాఫిక్ కూడలి వద్ద ఓ కిరాణా దుకాణ యజమాని శనివారం అడిగిన సరుకులు ఇవ్వలేదని మందుబాబులు సామగ్రి చిందరవందరగా విసిరేశారని బాధితుడు వాపోయాడు. స్థానికంగా ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద మద్యం సేవించిన వీరు కిరాణా షాపునకు వెళ్లి సామగ్రి అడిగారు. ఆ సామగ్రి లేవని పేర్కొనడంతో గొడవకు దిగారు. దీంతో కొంత సమయం వాహనాల రాకపో కలకు అంతరాయం కలిగింది. కాగా ఆ సమయంలో అక్కడకు వచ్చిన పోలీ సులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మహిళ మృతిపై కుటుంబ సభ్యుల నిరసన

రాజాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం మండలంలోని బూర్జి గ్రామానికి చెందిన ఎందువ దమయంతి అనారోగ్యంతో రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. గర్భసంచి తొలగింపునకు సంబంధించి శుక్రవారం ఆపరేషన్ చేశారు. విజయవంతంగా పూర్తయినట్లు అక్కడ వైద్యులు, సిబ్బంది తెలియజేశారు. ఇంతలో శుక్రవారం రాత్రి మృతిచెందింది. అయితే ఆపరేషన్ విజయవంతంకావడంతో డిశ్చార్జి కూడా ఇస్తామన్నారని, కానీ ఇప్పుడు చనిపోయిందని చెప్పడం ఏమిటని కుటుంబసభ్యులు ప్రశ్నించారు. సమాచారం అందుకున్న బంధువులు, గ్రామస్థులు శనివారం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. కాగా ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని పట్టణ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ఆక్రమణదారులకు నోటీసులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో ఆక్రమణలపై విచారణ నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీచేశారు. శనివారం ఆర్ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో ఇరిగేషన్, రెవెన్యూశాఖకు సంబంధించిన స్థలం కొంతమంది ఆక్రమించారని గ్రీవెన్స్‌లో పలుసార్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈమేరకు ఆయాల శాఖలు నిర్వహించిన సర్వేలో విజయనగరానికి చెందిన ఓ వైద్యుడు 60సెంట్లు ఇరిగేషన్ స్థలంతోపాటు నాలుగుసెంట్లు రెవెన్యూ స్థలం ఆక్రమించినట్లు గుర్తించారని చెప్పారు. రెవెన్యూ స్థలానికి సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత వైద్యుడికి వీఆర్వో ద్వారా నోటీసులు పంపించామని ఆర్ఐ తెలిపారు. అలాగే సెంటు పావు ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించడంతోపాటు సదరు వ్యక్తి 12 సెంట్లు ఆక్రమించి ఇరిగేషన్ స్థలంలో నిర్మించిన ప్రహరీ తొలగించాలని నోటీసులు ఇచ్చామని చెప్పారు.వారు ఇచ్చిన వివరణ మేరకు తదుపరి చర్యలు తహసీల్దార్ సూచనల మేరకు తీసుకుంటామని తెలిపారు.

ఆక్రమిత స్థలంలో బోర్డులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుడుబిల్లి పంచాయతీ మదుర గ్రామం ఎన్.ఆల్తిపాలెంలోని సర్వేనంబరు-3లో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆదేశాల మేరకు తంగుడుబిల్లి వీఆర్వో రవికుమార్ శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సుదర్శనరావు హెచ్చరించారు

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు: ఎన్ఈఆర్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం కష్టపడే కార్యకర్తలకుగుర్తింపు ఉంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు తెలిపారు.శనివారం విజయనగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్‌వర్మ బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ తానుపార్టీకి చేసినవల్లే గుర్తింపు లభించందన్నారు. ప్రతి నాయకుడు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూసమస్యలపై పోరాడినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, లక్ష్మీనరసింహం,శివప్రసాద్ రెడ్డి, బి.శ్రీధర్ పాల్గొన్నారు.కాగా రాజేష్‌వర్మను జనసేన నాయకుడు గురాన అయ్యలు అభినందించారు.

గోవిందపురంలో రామ మందిరం ప్రతిష్ఠ

సంతకవిటి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోవిందపురంలో సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రాయగడకు చెందిన వేద పండితులు రేజేటి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పురోహితులు పుల ఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో వేద పండితులు రేజేటి శ్రీరామశర్మ, వేమ కోటినాగభూషణశర్మ, సతీష్‌శర్మ,శ్రీకాంత్‌శర్మ, రంప సంతోష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం పూజలు జరిగాయి. 250 మంది శ్రీరామ దీక్ష తీసుకొన్నారు.

వేసవిలో తాగునీరెలా?

(ఏడో పేజీ తరువాయి)

ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావులను అధికారులు పర్యవేక్షించడం లేదు. జిల్లాలో చంపావతి నది గజపతినగరం, గుర్ల, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల మీదుగా దాదాపు 100 కిలోమీటర్లు పైగా ప్రవహించి కోనాడ వద్ద సముద్రంలో కలుస్తోంది. నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 200 గ్రామాలకు తాగునీరు అందించే 86 తాగునీటి పథకాలకు సంబంధించి ఊటబావులు ఉన్నాయి. వీటి ద్వారా లక్షలాది మందికి తాగు నీరు అందుతోంది. నెల్లిమర్ల, రామతీర్థం వద్ద ఉన్న ఊటబావులు విజయనగరం కార్పొరేషన్ ప్రజల దాహార్తిని తీర్చుతున్నాయి. ఇక్కడ ఎత్తిపోతల పథకాల ద్వారా రైల్వేకు సైతం నీరు అందిస్తున్నారు. అయితే ఊటబావుల చుట్టూ ఇసుక తోడేయడంతో బురద నీరు చేరుతోంది. కోళ్ల వ్యర్థాలను సైతం పారబోస్తున్నారు.

నాగావళిలోనూ అంతే..

రేగిడి ఆమదాలవలస సంకిలి వద్ద నాగావళిలో ఊటబావులను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో 231 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. సంకిలి వద్ద సుజలధార పథకం ద్వారా నీటిని అందిస్తున్నారు. అయితే నదిలో ఉన్న ట్యాంకుల్లోకి చెత్త, వ్యర్థాలు చేరుతున్నాయి. తరచూ నీరు కలుషితం అవుతోంది.

తగ్గుతున్న భూగర్భ జలాలు

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 4.10 మీటర్ల లోతులో నీటి జాడ కనిపించేది. 2018 లో అది 5.80 మీటర్లకు చేరింది. గత ఐదేళలో ఆరు మీటర్లకు పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. మరింత దిగజారితే చాలా మండలాలకు దాహం కేకలు తప్పదు.

'క్రాష్' ప్రారంభం

ఈ ఏడాది యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. తాగునీటి వనరుల మరమ్మతులకు పూనుకుంది. జిల్లా వ్యాప్తంగా క్రాష్ ప్రోగ్రం ప్రారంభమైంది. ఇందుకు సంబంధించి మండల పరిషత్‌లకు రూ.8 కోట్లు, పంచాయతీలకు రూ.32.60 కోట్లు, మెయింటెన్‌గ్రాండ్ అందుబాటులో ఉంది. ఇప్పటికే మండలాల వారీగా సామగ్రి కేటాయించారు. చేతిపంపులు, పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ పథకాలకు మరమ్మతులు చేయనున్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రామమోహనరావు

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత పరీక్షల నిరోధక చట్టం(పీసీపీఎన్‌డీటీ)ను కఠినంగా అమలు చేయాలని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామమోహనరావు అన్నారు. శనివారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో లింగ నిర్ధారిత నిరోధక చట్టం అమలుపై ఆయన డివిజనల్ స్థాయి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాల్లో సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే అంశాన్ని చర్చించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి సంతోషకుమరి, వైద్యాధికారులు, వైద్యులు, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో పింఛన్ పంపిణీ చేయకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని గొర్లెసీతారాంపురం కార్యదర్శి అబ్దుల్ కలాం, సర్వేయర్ రామకృష్ణ, రంగరాయపురం, చింతాడ వీఆర్వోలు ఉప్పాడ గంగరాజు, ఎ.గౌరీశంకర్, జగన్నాథపురం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.సునీల్ కుమర్‌లకు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఆయన చెప్పారు. గత నెలలో కూడా ఇదే సమయంలో పింఛన్లు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకు గాను మెమోలు ఇవ్వగా ఈ నెలలో కూడా అదే పునరావృతంతో డీఆర్‌డీఏ పీడీ వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఆయన తెలిపారు.

స్త్రీ నిధుల మళ్లింపుపై విచారణ

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ముత్తాయివలస గ్రామంలో మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న స్త్రీనిధులు దారి మళ్లింపుపై వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని ఆయా పొదుపు సంఘాల వద్దకు వెళ్లి రుణాలు ఎవరికి మంజూరు అయ్యాయి, ఎవరకి అందజేశారన్న వివరాలను రికార్డులను పరిశీలించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో అన్ని గ్రూపుల రికార్డులను విచారించి పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. ఇటీవల జిల్లా నుంచి ఏజీఎం ఉమామహేశ్వరరావు గ్రామంలోకి విచారణకు రాగా గందరగోళ పరిస్థితిలో విచారణ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శనివారం మళ్లీ విచారణ చేపట్టామని ఏపీఎం తెలిపారు.

నేడు ఆంగ్ల భాషా ప్రతిభా పరీక్ష

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాయబోయే స్కూల్ టాపర్స్‌కు ఆదివారం బొబ్బిలిలోని రాజా కళాశాలలో 15వ రాష్ట్ర స్థాయి ఆంగ్ల భాషా ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నట్టు డెల్టా అధ్యక్షుడు ఎం.విజయ్‌మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతికి చెందిన సుమారు 265 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఫలితాలను మధ్యాహ్నం విడుదల చేసి, విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరిస్తామని తెలిపారు.

ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. నాయుడువలస గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. తూతూ మంత్రంగా పనులు చేపట్టడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. అలాగే కొలతలు పూర్తిచేసే విధంగా వేతనదారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మస్తర్లు పరిశీలించారు.

ఘనంగా పోలమాంబ విగ్రహ ప్రతిష్ఠ

బాడంగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బాడంగి గ్రామంలో పోలమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వేతన జీవులకు ఊరట



(ఏడో పేజీ తరువాయి)

సంబంధించి ధరలు తగ్గించారు. తద్వారా జిల్లాలో జూట్ మిల్లులకు ఆదరణ పెరిగే అవకాశముంది. అంతర్రాష్ట్ర రహదారులు, వంతెనల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించారు. జిల్లాలో మానాపురం, కేఎల్ పురం వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జిల పనులు ఊపందుకోనున్నాయి. పరిశ్రమలు నెలకొల్పడానికి ఈ బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఎంఎస్ఎంఈలకు వచ్చే ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లు కేటాయించడం, 27 రంగాల్లో స్టార్టప్ రుణాల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి ఒక్కో సంస్థకు రూ.5లక్షలతో క్రెడిట్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. సోలార్ విద్యుత్‌కి అధిక ప్రోత్సాహకాలు అందజేశారు. విద్య, వైద్యం తదితర రంగాలకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ స్కూల్స్‌లో 50 వేల (పీఎం శ్రీ) అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. అదే విధంగా అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌కు బ్రాడ్‌బ్యాండ్ సేవలు కల్పించాలని, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయం. క్యాన్సర్ ఆసుపత్రుల నిర్మాణం, అధునాతన వైద్య సౌకర్యాల కల్పనతో చాలా మేలు కలగనుంది. వేతనదారులకు ఏడాదికి రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించారు.

● మహాకవి గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గేయం' దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అనే తొలి పంక్తిని ప్రస్తావిస్తూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంటులో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. గురజాడ మాటలను పార్లమెంట్ సాక్షిగా గుర్తుచేశారు. సమాజ ఉద్ధరణకు ఆయన అందించిన సేవలను స్మరించారు. దీనిపై గురజాడ కుటుంబ సభ్యులు, గురజాడ కల్చరల్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్య తరగతి ప్రజలకు ఊరట



ఆదాయపు పన్నులో చేసిన భారీ మార్పులు మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చాయి. పాత పన్ను విధానంతో పోల్చితే కొత్త విధానం చాలా సరళంగా ఉంది. పోలవరానికి నిధులు కేటాయించి, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయం.

\- బేబీనాయన, బొబ్బిలి ఎమ్మెల్యే


ప్రగతిశీల బడ్జెట్



కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజానుకూల ప్రతిశీల బడ్జెట్ ప్రవేశపెట్టింది. రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, పోలవరం, విశాఖ పోర్టుకు నిధులు మంజూరు చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

\- కిమిడి నాగార్జున, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు ఆమోద యోగ్యం



అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి వారికి అనేకమైన రాయితీలు ఇచ్చారు. బిందు, తుంపర సేద్యానికి రాయితీలు ఇవ్వడంతో వ్యవసాయ రంగం ఎక్కువ అభివృద్ధి చెందుతుంది.

\- గద్దె బాబురావు, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే

కీలక రంగాలకు మద్దతు



మధ్య తరగతికి ప్రోత్సాహం, కీలక రంగాలకు మద్దతు కలిగించేలా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారు. వేతన జీవులకు ఊరట కలిగించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5.936కోట్లు, విశాఖపోర్టుకు రూ.730 కోట్లు కేటాయించారు. రోడ్లు, వంతెనలకు నిధులు కేటాయించడం హర్షనీయం.

\- కోళ్ల లలిత కుమారి, ఎస్.కోట ఎమ్మెల్యే

రైతుకు మేలు



కేంద్ర బడ్జెట్ యువతకు, రైతుకు మేలు చేకూర్చే విధంగా ఉంది. ఆదాయపు పన్ను రూ.12లక్షల వరకు వెసులుబాటు ఇవ్వడం స్వాగతించదగ్గ విషయం. పోలవరానికి నిధులు కేటాయింపు హర్షించదగ్గ విషయం

\- పుల్లెల శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

కేవలం ఆరు రంగాలకే ప్రాధాన్యం



ఈ బడ్జెట్‌లో కేవలం ఆరు రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం సముచితం కాదు. అయితే ఈ బడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగించింది. అటల్ టింకరింగ్ లాబ్స్ ఏర్పాటుకు, జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రుల్లో క్యాన్సర్ కేంద్రాలు ప్రవేశపెట్టేలా నిధులు కేటాయించడం అభినందనీయం.

\- జేసీ రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్

పేదలకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే విజయచంద్ర



ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తున్న దళితులు

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పేద దళితులకు, గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని పెదబండపల్లి ప్రాంతానికి చెందిన దళితులకు 1980లో అప్పటి ప్రభుత్వం సంగంవలస రెవెన్యూ పరిధిలో సుమారు 20 ఎకరాల భూమిని అందజేసింది. అయితే ఈ భూమిని వైసీపీ హయాంలో చుక్క శ్రీదేవి అనే మహిళ పార్టీ అండతో ఆక్రమించుకుందని వారు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి శనివారం ఆ ప్రాంతానికి వెళ్లి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం కేటాయించిన భూములు దళితులకే చెందాలని, ఆక్రమించిన మహిళపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణలపై ప్రశ్నిస్తే తిరిగి దళితులపైనే కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ఎంఆర్ నగరంలో కూడా ఇదే పరిస్థితి ఉంటే వైసీపీ ప్రభుత్వం కాలంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, చుక్క అచ్యుత, బోనుదేవి చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, వంగపండు త్రినాథనాయుడు, రెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

సీతానగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సీతానగరం, బలిజిపేట మండలాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ పద్మావతి తెలిపారు. శనివారం జరిపిన దాడుల్లో గంగాడ గ్రామంలో ఏడు మద్యం సీసాలతో ఒక వ్యక్తిని, బూర్జ గ్రామంలో పది మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేశామని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది అక్టోబరు 16 నుంచి తాజాగా శనివారం వరకు సీతానగరం మండలంలో 30 బెల్టు కేసుల్లో 30 మందిని గుర్తించి 401 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే బలిజిపేట మండలంలో 21 బెల్టు కేసుల్లో 21 మందిని అదుపులోకి తీసుకుని 240 మద్యం సీసాలను, గరుగుబిల్లి మండలంలో 14 బెల్టు కేసుల్లో 14 మందిని అదుపులోకి తీసుకుని 150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలతో పాటు సారా విక్రయాలు, గంజాయి విక్రయాలు చేపట్టినట్లయితే 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

కుష్ఠు వ్యాధి నివారణ సాధ్యమే



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి మచ్చ కుష్ఠు వ్యాధి లక్షణం కాదని, వ్యాధి లక్షణాలను స్పష్టం తెలుసుకుని వైద్యులను సంప్రదిస్తే దాని నివారణ సుసాధ్యమేనని జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జనవరి 30 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డీపీఎంవో ఎం.బలరాంనాయుడు, హెచ్ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్‌వో హైమావతి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు, సీహెచ్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేరళ పర్యటనకు గిరిజన రైతులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పీవో

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మారిషస్ పైనాపిల్ పంటపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడానికి సీతంపేట, భామిని మండలాలకు చెందిన 36 మంది గిరిజన రైతులు శనివారం కేరళ పయనమయ్యారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి రైతులు పయనమయ్యే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ సీతంపేట, భామిని మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపడుతున్న మారిషస్ పైనాపిల్ పంటపై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు ఇతర హార్టికల్చర్‌కు సంబంధించిన పంటల విధానాలపై క్షేత్రస్థాయి పర్యటనలు ద్వారా అవగాహన కల్పిస్తారని ఆయన చెప్పారు. రైతులతో పాటు పీహెచ్‌వో వెంకట గణేష్, హెచ్‌వో జయశ్రీ, హార్టికల్చర్ అసిస్టెంట్లు దివాకర్, కావ్య తదితరులు వెళ్లారు.

ఒడిశా దూకుడు చర్యలను నిరోధించాలి

● దిగువశెంబిలో సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూపు గ్రామాలపై ఒడిశా దూకుడు చర్యలను ఏపీ అడ్డుకోవాలంటూ దిగువశెంబిలో శనివారం సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. దిగువశెంబి అంగన్‌వాడీ కేంద్రంలో ఒడిశా పోలీసులు చొరబడి సామాగ్రి తీసుకోకపోవడం దారుణమన్నారు. ఒడిశా దూకుడును ఏపీ అడ్డుకుని కొఠియా గ్రూపు గ్రామాల్లో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుచ్చ, బాత్రి, ఉత్తర, రుప్ప, విజయ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రమ్మకు నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కర్షక మహర్షి ఆసుపత్రి అధినేత ద్వారపురెడ్డి రామ్‌మోహనరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు మాతృమూర్తి సావిత్రమ్మకు పలువురు నివాళులర్పించారు. గత నెల 21న సావిత్రమ్మ మృతి చెందారు. శనివారం కొత్తూరులో పెద్దకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కుమారులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, వెంకటతిరుపతిరావు, కుమార్తె కాపారపు కిరణ్మయి, జనార్ధననాయుడుతో పాటు కర్షక మహర్షి ఎండీ డి.పృధ్వీ మోహన్, కొత్తూరు సర్పంచ్ డి.రజని, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా చిత్తడి నేలల ప్రయోజనాలను హెచ్ఎం ఎన్వీ రావు వివరించారు. చిత్తడి నేలల ప్రయోజనాలపై విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.

హెచ్చరిక బోర్డులేవీ?

● ప్రమాదకరంగా మలుపులు



అచ్చెపువలస వద్ద ప్రమాదకర మలుపు

వీరఘట్టం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరఘట్టం నుంచి మూలలంక వెళ్లే రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద పొదలతో నిండుకొని ఉండడంతో రహదారి మలుపులు వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయి. అధికారులు స్పందించి మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన లక్ష్మీగణపతి విగ్రహానికి ఏడో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతికి సహస్ర శత నామార్చన పూజలను నిర్వహించారు. గణపతి హోమ పూజలు, శిఖర అభిషేక పూజలు నిర్వహించారు.

న్యూస్ బాక్స్

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సత్యసాయిబాబా మందిరం వద్ద ఈనెల 3న సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

దోమ తెరల పంపిణీ

కొమరాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పూడేసు గ్రామంలో గిరిజనులకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు శనివారం దోమ తెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఐఆర్‌పీడబ్ల్యూ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు

సీతానగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ దిశగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. నిడగల్లు-4 అంగన్‌వాడీ కేంద్రంలో ఎనీమియా గర్భిణులకు, రక్తహీనతతో ఉన్న గర్భిణీకి అమృత ఆహారాన్ని పంపిణీ చేశారు. మునగాకు బిస్కెట్లు, రాగి మిల్లెట్ బిస్కెట్లు, రాగి చక్కీలు అందజేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పాలకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటోతో 80 లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. సింగన్నవలస గ్రామ జంక్షన్ నుంచి పాలకొండ రెల్లివీధికి వెళ్లే దారిలో తనిఖీలు చేయగా సీతంపేట మండలం జక్కరవలస గ్రామానికి చెందిన వ్యక్తి 80 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. ఈ దాడుల్లో పాలకొండ మొబైల్ సీఐ పి.మురళీధర్, ఎస్ఐలు తిరుపతిరావు, ఫణీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

పాలకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సిబ్బందికి సూచించారు. నగర పంచాయతీలోని 19 వార్డులో ఆయన శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం పలు వార్డుల్లో పర్యటించారు. తాగునీటి పైపుల వద్ద సక్రమంగా నీరు వస్తుందా.. లేదానని పర్యవేక్షించారు. ఆయన వెంట నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ విడుదల

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో మార్చి 23న నిర్వహించనున్న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. పోటీలను విజయవంతం చేసేందుకు అంతా సహకరించాలని ఆయన కోరారు. తమ సహకారం కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు, యువత పాల్గొన్నారు.